# నాడు కనువిందు..
# నేడు కనుమరుగు



జూలో శిథిలమైన సీతాకోకచిలుకల పార్కు. (ఇన్‌సెట్) పార్కు లోపల మెస్ లేని పైభాగం

## జూలో శిథిలావస్థకు చేరిన సీతాకోకచిలుకల పార్కు

- మాయమవుతున్న రంగురంగుల సీతాకోకచిలుకలు
- పిచ్చి మొక్కలతో నిండిన ప్రాంగణం
- నిరాశగా వెనుదిరుగుతున్న సందర్శకులు
- పట్టించుకోని జూ అధికారులు

**ఆరిలోవ:** ఇందిరాగాంధీ జూ పార్కులోని సీతాకోకచిలుకల పార్కు శిథిలావస్థకు చేరింది. నాడు సందర్శకులను ఎంతగానో కనువిందు చేసిన ఈ బటర్‌ఫ్లై వరల్డ్.. నేడు కనుమరుగవుతోంది. పార్కు లోపల వాటర్ ఫౌంటెయిన్ మూగబోయింది. పార్కు పైకప్పు ధ్వంసమైంది. దాని మీద వేసిన మెస్, ద్వారం మెస్ పూర్తిగా చిరిగి ఎగిరిపోయాయి. దీంతో పార్కులోని వివిధ రకాల సీతాకోకచిలుకలు మాయమయ్యాయి. సందర్శకులు ఇటువైపు రాకపోవడంతో రెండేళ్లుగా ఈ పార్కు వెలవెలబోతోంది.

**అలా మొదలైంది..**

జూ పేరు చెప్పగానే ఎన్నో రకాల పక్షులు, వివిధ జాతులకు చెందిన జంతువులు గుర్తొస్తాయి. సందర్శకులకు వాటి ద్వారా వినోదంతోపాటు విజ్ఞానం లభిస్తోంది. సందర్శకులను మరింత ఆకర్షించేందుకు జూ అధికారులు సీతాకోకచిలుకలను అందుబాటులోకి తీసుకురావాలని 2010లో ఆలోచించారు. అదే ఏడాది జూ బయోస్కోప్ సమీపంలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్‌కు ఎదురుగా సుమారు 1000 చదరపు గజాల విస్తీర్ణంలో బటర్‌ఫ్లై వరల్డ్ పేరిట పార్కు ఏర్పాటు చేశారు. దీనిలో రకరకాల సీతాకోకచిలుకలను ఉత్పత్తి చేశారు. బయట నుంచి వీటి లార్వా సేకరించి వాటి సంఖ్యను పెంచేవారు. దీంతో ఇక్కడ రంగురంగుల సీతాకోకలు సందర్శకులను కనువిందు చేసేవి. ఇవి బయటకు ఎగిరిపోకుండా కింద నుంచి సుమారు 40 అడుగుల ఎత్తు వరకు అర్ధ చంద్రాకారంలో ఇనుప ఊచలతో పైకప్పు ఏర్పాటు చేశారు. దానిపై చిన్న రంధ్రాల నుంచి గాలి, వెలుతురు వచ్చేటట్లు మెస్ అమర్చారు. దీని నుంచి లోపలకు వచ్చే వెలుతురులో సందర్శకులు పార్కులో ఎగిరే సీతాకోకచిలుకలను చూసి మురిసిపోయేవారు. ఇప్పుడా పరిస్థితి కనుమరుగైంది.


ఉపయోగం లేని గడ్డి మొక్కల ప్రదేశం

**రెండేళ్లుగా అండర్ మెయింటినెన్స్ బోర్డు..**

ఈ పార్కు శిథిలావస్థకు చేరి రెండేళ్లు దాటింది. అప్పటి నుంచి పార్కులో మరమ్మతు పనులు జరుపుతున్నామంటూ 'అండర్ మెయింటినెన్స్' బోర్డు తగిలించేశారు. ఈ పార్కుకు వెళ్లే వారు బోర్డును చూసి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అనుకుంటున్నారు. ఇక్కడ ఎలాంటి పనులు జరగడం లేదు. రెండేళ్లుగా ఈ బోర్డుతోనే అధికారులు కాలం గడిపేస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. జూ అధికారులు స్పందించి సీతాకోకచిలుకల పార్కును పునరుద్ధరించాలని సందర్శకులు కోరుతున్నారు.

### ఇలా శిథిలమైంది..

సీతాకోకచిలుకల పార్కు శిథిలావస్థకు చేరి సుమారు రెండేళ్లు గడుస్తున్నా.. జూ అధికారులు పట్టించుకోలేదు. దీని లోపల సందర్శకులను కనువిందు చేసే వాటర్ ఫౌంటెయిన్ పనిచేయడం లేదు. దీని నుంచి వెదజల్లే నీరు మొక్కలపై పడి సీతాకోకచిలుకలకు నిత్యం చల్లదనాన్ని ఇచ్చేది. పార్కులోకి వెళ్లే సందర్శకులకు ఆహ్లాదం పంచేది. సీతాకోకలకు మధుర రసాలను ఇచ్చే ఫౌంటెయిన్ చుట్టూ గల వివిధ రకాల పూల మొక్కలు ఎండిపోయాయి. పార్కు పైకప్పు శిథిలమైంది. దాని మీద వేసే మెస్ చిరిగిపోయి పూర్తిగా ఎగిరిపోయింది. దీని ద్వారానికి అమర్చిన మెస్‌ది అదే పరిస్థితి. ఈ పార్కు శిథిలం కావడంతో ప్రస్తుతం వాటి పునరుత్పత్తి జరగక సీతాకోకచిలుకలు కనుమరుగయ్యాయి.


పార్కులో పనిచేయని వాటర్ ఫౌంటెయిన్

## నాణేల కోసం మత్స్యకారుల అన్వేషణ


సాగర తీరంలో నాణేల కోసం అన్వేషిస్తున్న మత్స్యకారులు

**ఏయూక్యాంపస్:** సముద్రం అనేక ప్రత్యేకతల సమాహారం. తనలో ఎన్నో విశిష్టతలను నింపుకుంటుంది. మానవాళికి ప్రాణవాయువును అందించడమే కాకుండా అనేక జీవుల మనుగడకు మూల కారణంగా నిలుస్తోంది. అటువంటి సముద్రానికి మరో ప్రత్యేక లక్షణం కూడా ఉంది. తనలో ఏదీ దాచుకోకుండా అన్నీ తీరానికి తోసేస్తుంది. ఈ సూత్రం ఆధారంగా చేసుకుని మత్స్యకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తుపాను కారణంగా చేపల వేటకు వెళ్లడం సాధ్యపడటం లేదు. ఖాళీగా ఉండటం ఇష్టం లేని మత్స్యకారులు సాగర తీరంలో నాణేల కోసం అన్వేషించడం కనిపించింది. శనివారం ఉదయం విశాఖ సముద్ర తీరంలో పదుల సంఖ్యలో మత్స్యకారులు సముద్రంలోకి కొట్టుకుని తీరానికి వచ్చే నాణేలను సేకరించే పనిలో పడ్డారు. వివిధ సందర్భాలు, పూజలు చేసినపుడు ప్రజలు సముద్రంలో విడిచిపెట్టే నాణేలు ఇటువంటి సమయంలో తీరానికి కొట్టుకొస్తాయి. కెరటాలు తీరానికి వచ్చే సమయంలో వాటితోపాటు ఈ నాణేలు వస్తుంటాయి. కెరటం వెనక్కి వెళ్లగానే నాణాన్ని గుర్తించి వాటిని ఒడిసిపట్టుకోవడం మత్స్యకారులకు వెన్నతో పెట్టిన విద్య. దీనికోసం వర్షంలో సైతం వారు అలలకు ఎదురుగా నిల్చుని, గంటల తరబడి నిరీక్షిస్తూ వీటిని సేకరిస్తారు. దీనితో వీరి కాళ్లు నీళ్లలో నానిపోతున్నాయి. వేటకు విరామం రావడంతో సరదాగా వీరంతా ఈ పనిలో మునిగిపోయారు.

## క్లుప్తంగా

### ఏయూ పురుషుల కరాటే జట్టు ఎంపిక


క్రీడాకారులతో రిజిస్ట్రార్ ధనుంజయరావు

**విశాఖ విద్య:** ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కరాటే పురుషుల పోటీల్లో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం కరాటే జట్టును ఎంపిక చేసినట్లు క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎన్.విజయమోహన్ తెలిపారు. ఏడుగురు సభ్యులతో కూడిన ఈ బృందం సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది. భోపాల్‌లోని ఎల్.ఎన్.సి.టి. యూనివర్సిటీలో ఈ నెల 3 నుంచి 7 వరకు నిర్వహించే పోటీలకు ఏయూ తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను శనివారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో అభినందించారు. వారికి క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి శుభాకాంక్షలు తెలిపారు. కరాటే కోచ్ కె.చిన్నారావు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఆరిలోవ:** జీవీఎంసీ 10వ వార్డు సుందర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ ముద్దిల రామలక్ష్మి, జీవీఎంసీ అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.36 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు, కాలువలు, రిటర్నింగ్ వాల్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. పనులు వేగంగా జరిపించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–2 ఇన్‌చార్జి జెడ్సీ ఫణిరాం, జీవీఎంసీ ఈఈ శాంతిరాజు, డీఈ అప్పారావు, ఏఈ వెంకటరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఓం నమో వేంకటేశాయ



కమల పుష్పాల అలంకరణలో వైభవ వేంకటేశ్వరుడు


తులసిమాలల అలంకరణలో త్రిమూర్తిక వెంకన్న

**మద్దిలపాలెం:** వెంకన్న ఆలయాలన్నీ శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరాలయంలో స్వామిని తులసిమాలలతో అలంకరించారు. అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ భక్తుల పేరిట ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు పాల్గొన్నారు.

- కొత్త వెంకోజిపాలెం రామాలయంలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామిని 1,200 కమల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించి పూజలు నిర్వహించారు. అర్చకుడు కిషోర్ శర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేశారు.

### ఏడాకుల చెట్లకు ప్రూనింగ్


వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా పువ్వులు, కొమ్మలు తొలగించిన ఏడాకుల చెట్లు

**ఏయూక్యాంపస్:** ఏడాకుల చెట్లు పుష్పించే కాలం ప్రారంభం కావడంతో ప్రజలు వాటి కొమ్మలను తొలగించే పనిలో పడ్డారు. పలు ప్రాంతాల్లో పువ్వులతో ఏడాకుల చెట్లు విస్తారంగా ఉన్నాయి. వీటి నుంచి వచ్చే వాసన శ్వాస సంబంధమైన వ్యాధులకు కారణంగా మారుతుందనే భయం ప్రజల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఏడాకుల చెట్ల కొమ్మలు, పువ్వులను తొలగిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఉన్న చెట్లకు ప్రూనింగ్ చేశారు. చుట్టూ పువ్వులతో ఉన్న కొమ్మలను తొలగించారు.

## నాకవుట్‌కు దగ్గరగా 'ఆంధ్ర'

**విశాఖ స్పోర్ట్స్:** దేశవాళీ ధనాధన్ టీ–20 క్రికెట్ నాకవుట్‌కు ఆంధ్రా జట్టు దగ్గరవుతోంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా విశాఖ వేదికగా గ్రూప్ డీ మ్యాచ్‌లు జరుగుతుండగా.. ఆంధ్రా జట్టు గ్రూప్ 'ఈ'లో హైదరాబాద్ వేదికగా ఆడుతోంది. గ్రూప్‌లో 7 రాష్ట్ర జట్లు తలపడుతుండగా.. ఆంధ్రా జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి 12 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తర్వాత మ్యాచ్‌లో 12 పాయింట్లతో సమఉజ్జీగా కొనసాగుతున్న కేరళ, ఎనిమిదేసి పాయింట్లతో కొనసాగుతున్న సర్వీసెస్, ముంబయి జట్లతో ఆడాల్సి ఉంది. గ్రూప్‌లో విజేతగా నిలిస్తే నేరుగా నాకవుట్‌కు చేరుకునే అవకాశం ఉంది. గతేడాది ఆరో స్థానంలో ఆంధ్రా జట్టు నిలిచి.. గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించింది.

**రాణిస్తున్న విశాఖ కుర్రాళ్లు**

ఆంధ్రా జట్టుకు నాయకత్వం వహిస్తున్న విశాఖ కుర్రాడు రికీబుయ్ గోవాతో జరిగిన మ్యాచ్‌లో 72 పరుగులతో నిలిచి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. వికెట్ కీపర్ భరత్ కూడా ఈ మ్యాచ్‌లో 57 పరుగులతో రాణించాడు. ఐదు క్యాచ్‌లు పట్టి జట్టు విజయంతో కీలకపాత్ర పోషించాడు. మీడియం పేసర్ శశికాంత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ సత్తాచాటి మొత్తంగా ఆరు వికెట్లు తీశాడు. అవినాష్ ఒక మ్యాచ్‌లోనే ఆడగా 55 పరుగులు చేసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు.

## ఎలక్ట్రీషియన్ల పిల్లలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


స్కాలర్‌షిప్ ప్రొగ్రాం విజేతలతో నిర్వాహకులు

**టీవీరోడ్డు:** ఎలక్ట్రీషియన్ పిల్లల చదువులకు అండగా ఉండేందుకు ఆర్‌ఆర్ కేబెల్ నిర్వహించిన కేబెల్ స్టార్ స్కాలర్‌షిప్ ప్రొగ్రాం–2024 విజేతలను ఆర్‌ఆర్ గ్లోబల్ డైరెక్టర్ కీర్తి కాబ్రా ప్రకటించారు. నగరంలోని వీఐపీ రోడ్డు దరి హోటల్ మంత్రిలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన ఎలక్ట్రీషియన్ల పిల్లల కోసం ఈ ప్రొగ్రాం రూపొందించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఏటా రూ.1 కోటి కంటే ఎక్కువ నిధులను ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి కేటాయించినట్టు చెప్పారు. స్కాలర్‌షిప్ ప్రొగ్రాం రెండు సీజన్‌లను కంపెనీ విజయవంతంగా అమలు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 1,000 మంది స్కాలర్‌షిప్ విజేతల్లో, 54 మంది ఏపీకి చెందిన వారని తెలిపారు. కార్యక్రమంలో స్కాలర్‌షిప్ విజేతలు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఏయూ అంతర్ కళాశాలల పోటీలు


ఆర్చరీ పోటీలు ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్


యోగా పోటీల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు

**విశాఖ విద్య:** ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల ఆర్చరీ, యోగా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా నిర్వహిస్తున్నా ఈ పోటీలను రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు శనివారం వీక్షించి క్రీడాకారులకు ఏర్పాటు చేసిన వసతులపై, క్రీడా పోటీల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రోత్సహించారు. ఆర్చరీ క్రీడల్లో తనకున్న ఆసక్తిని వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆయా క్రీడల్లో ఉన్నతంగా రాణించి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ ఆర్చరీలో 9 కళాశాలలకు చెందిన 20 మంది క్రీడాకారులు పోటీ పడ్డారని, యోగాలో 18 కళాశాలలకు చెందిన 40 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారని తెలిపారు. జట్ల మధ్య ఉత్కంఠ భరిత పోరు జరిగింది. ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వివిధ వర్సిటీ, వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బీచ్ రోడ్డులో వాటర్ ప్లాంట్ ఏర్పాటు


టీయూ–142 మ్యూజియం వద్ద వాటర్ ప్లాంట్

**ఏయూక్యాంపస్:** బీచ్ రోడ్డులో పర్యాటకులకు ఉపయుక్తంగా నిలిచేలా కొత్తగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సబ్‌మెరైన్ మ్యూజియానికి ఎదురుగా టీయూ–142 యుద్ధ విమానం మ్యూజియం బయట దీనిని సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ప్లాట్‌ఫారం, పరికరాలు, చుట్టు రక్షణకు అవసరమైన గది నిర్మాణం పూర్తయింది. గది బయట నీరు తాగడానికి వీలుగా స్టీల్‌తో సింక్‌ను సైతం ఏర్పాటు చేశారు. నీటి సరఫరాకు అవసరమైన నీళ్ల ట్యాంక్ ఏర్పాటు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. త్వరలో పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసుకుని పర్యాటకులకు అందుబాటులోకి వాటర్ ప్లాంట్ రానుంది.

## ఎస్సీ కార్పొరేషన్ ఈవోకు పదవీ విరమణ సత్కారం


ఈవో నిర్మలను సత్కరిస్తున్న డీడీ రామారావు, ఈడీ సత్యపద్మ తదితరులు

**ఎంవీపీకాలనీ:** ఎస్సీ కార్పొరేషన్‌లో కొన్నేళ్లుగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో)గా సేవలందిస్తున్న ఎం.నిర్మల శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీ సంక్షేమ భవనంలోని ఎస్సీ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగులు అభినందన సభ నిర్వహించి ఆమెను ఘనంగా సత్కరించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిర్మల అందించిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ప్రశాంతమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ, పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## అభిషేక్‌కు అభినందన


అభిషేక్‌ను అభినందిస్తున్న ప్రణవ్ గోపాల్

**విశాఖ విద్య:** అమెరికాలోని ఈక్యూ ఫర్ పీస్ సంస్థ బోర్డ్ మెంబర్, డీన్ వాన్ లీవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన డా.చల్లా కృష్ణవీర్ అభిషేక్‌ను శనివారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అభినందించారు. ఈ గుర్తింపు విశాఖపట్నం, భారతదేశానికి అపారమైన గౌరవాన్ని తెచ్చి, భావోద్వేగ మేధస్సు, శాంతిని ప్రోత్సహించడంలో దోహదపడుతుందని ప్రణవ్ గోపాల్ అన్నారు. అభిషేక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

## గాయత్రి కళాశాలలో స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్స్

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో కొత్తగా స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్స్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26 నుంచి 30 వరకు 5 రోజుల పాటు ఈ కోర్సులో అందించిన శిక్షణలో 94 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఎంబెడెడ్ సిస్టమ్స్, ప్రోగ్రామింగ్‌లో ఆచరణాత్మక విజ్ఞానం, ప్రయోగాత్మక నైపుణ్యం విద్యార్థుల్లో పెంచడమే లక్ష్యంగా ఈ కోర్సు అందుబాటులోకి తెచ్చామన్నారు.

## జ్వర పీడితులకు వైద్య సేవలు

సాక్షి ఎఫెక్ట్..

**ఆరిలోవ:** నగరంతోపాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జ్వర పీడితుల కోసం ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు తెలిపారు. విమ్స్‌లో పెరుగుతున్న జ్వర పీడితుల ఓపీపై 'సిటీకి జ్వరమొచ్చింది' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో వెలువడిన వార్తకు ఆయన స్పందించారు. వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్‌కు జనం గురవుతున్నారన్నారు. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారి ఓపీ అన్ని యూపీహెచ్‌సీల్లో నమోదవుతోందని చెప్పారు. వైరల్ ఫీవర్లు, టైఫాయిడ్, చికెన్‌గున్యా లక్షణాలు ఉన్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని ప్రాంతాల్లో రోగుల ఇళ్లకు వెళ్లి మానిటరింగ్ చేస్తున్నారని తెలిపారు. జిల్లా మలేరియా విభాగం అధికారులు రోగులను పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నారన్నారు. టైఫాయిడ్, వైరల్ ఫీవర్ బాధితులకు యూపీహెచ్‌సీలో వైద్యం అందిస్తున్నామన్నారు. జీవీఎంసీ మలేరియా, ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సంయుక్తంగా గృహ సముదాయాల్లో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాలు జరిపి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మలేరియా సబ్ యూనిట్, యాంటీ మలేరియా యూనిట్ సిబ్బంది నిరంతరం సేవలందిస్తున్నారని డీఎంహెచ్‌వో తెలిపారు.

## ఏపీకి ప్రత్యేక హోదా అవసరం

**మద్దిలపాలెం:** ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్ న్యాయ సమ్మతమైనదని పీసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూల వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి హోదా ఇచ్చే విషయంలో రాతపూర్వక హామీ లేనందున తాము ఏమీ చేయలేమని ధర్మాసనం చెప్పడం ధర్మం కాదన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం కూటమి ప్రభుత్వ నేతలు కార్యాచరణకు పూనుకోవాలని సూచించారు. డిప్యూటీ సీఎం తన వైఖరి తెలుగు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల్లో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తిరుపతి సభలో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. హోదా ముగిసిన అధ్యాయమని రాష్ట్ర ప్రజలను మోసపుచ్చారని ఆరోపించారు. ప్రత్యేక హోదా సాధనకు రాష్ట్ర పాలకులు నిజాయితీగా వ్యవహరించాలని కోరారు.

## స్వీట్స్ షాపులో ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ దాడులు



ఎంవీపీ కాలనీలోని స్వీట్స్, నేతి బొబ్బట్ల షాపు

**ఎంవీపీకాలనీ:** ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం రోడ్డులోని తాపేశ్వరం వారి శ్రీలక్ష్మీగణపతి స్వీట్స్(వేడి వేడి నేతి బొబ్బట్లు) షాపులో శనివారం ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. అక్కడ తయారు చేస్తున్న బొబ్బట్లు, ఆహార పదార్థాల తయారీపై ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఆహార పదార్థాల తయారీ గదిలోని పలు పదార్థాలను సీజ్ చేశారు. వాటి తయారీకి వినియోగిస్తున్న పలు వస్తువులను సేకరించి నాణ్యత ప్రమాణాల నిర్ధారణకు ల్యాబ్‌కు పంపించారు. పలు ఆహార పదార్థాల్లో నాన్ బ్రాండెడ్ నెయ్యి వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు వెల్లడించిన అధికారులు నెయ్యి సాంపిళ్లను సైతం ల్యాబ్ టెస్టింగ్‌కు పంపినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని పదార్థాలు వాడుతున్న నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ యాక్ట్–2006 ప్రకారం కేసులు నమోదు చేసి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ, ఫుడ్ సేఫ్టీ అధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో గొలుసు దొంగ

**ఆరిలోవ:** ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న ఓ గృహిణి మెడలో బంగారు గొలుసు దొంగిలించిన యువకుడిని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా.. 10వ వార్డు వివేకానందనగర్‌లో కె.అప్పయ్యమ్మ ఈ నెల 22 సాయంత్రం ఇంటి ముందు కల్లాపు చల్లి ముగ్గు పెడుతున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్లిన ఆరిలోవ దుర్గాబజార్‌కు చెందిన కె.వెంకటగౌతమ్ ఆమె మెడలో బంగారు శతమానాలతో కూడిన రెండు తులాల పుస్తెల తాడు లాగేసి పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని విషయం తెలుసుకొన్నారు. వెంటనే అన్ని వీధుల్లో పరుగులు తీసి వెతికినా దొరకలేదు. అదే రోజు అప్పయ్యమ్మ గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు దొంగిలించి పారిపోయినట్లు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలం సమీపం నుంచి అందుబాటులో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించారు. దొంగతనానికి పాల్పడింది దుర్గాబజార్‌కు చెందిన వెంకటగౌతమ్‌గా గుర్తించారు. శనివారం ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని, 2 తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు.

- ఎంవీపీ కాలనీ క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం విలేకరుల సమావేశంలో గొలుసు దొంగతనం కేసు వివరాలను క్రైం అదనపు డీసీపీ మోహనరావు, తూర్పు ఏసీపీ వెంకటరావు వెల్లడించారు. ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాల సాయంతో నిందితుడు కుప్పా వెంకటగౌతమ్‌ను అరెస్ట్ చేశామన్నారు. ద్వారకా క్రైం సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

## నిర్మాణ రంగంలో క్రెడాయ్ సేవలు అభినందనీయం



ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

**ఎంవీపీకాలనీ:** నిర్మాణ రంగంలో క్రెడాయ్ విశాఖపట్నం అందిస్తున్న సేవలు అభినందనీయమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహిస్తున్న 10వ క్రెడాయ్ ప్రోపర్టీ ఎక్స్‌పోను శనివారం ఆయన సందర్శించారు. స్టాళ్ల వివరాలు, నిర్మాణ రంగంలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. క్రెడాయ్ విశాఖపట్నం చైర్మన్ కేఎస్ఆర్‌కే సాయి(రాజు) మాట్లాడుతూ డిసెంబర్ 1 వరకు ప్రోపర్టీ ఎక్స్‌పో కొనసాగుతుందన్నారు. ఆయా సంస్థలు 71 స్టాళ్ల ద్వారా ప్రాజెక్టులు ఆవిష్కరించాయని చెప్పారు. అనంతరం ప్రణవ్‌గోపాల్‌ను సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. క్రెడాయ్ వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, కార్యదర్శి వి.శ్రీను, ఎక్స్‌పో కన్వీనర్ సిహెచ్.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## 5 నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

**సీతమ్మధార:** ఈ నెల 5 నుంచి నిర్వహించనున్న విశాఖ ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమార్ స్వామి పిలుపునిచ్చారు. పీఅండ్‌టీ కాలనీలోని కేశవ్ సేవా సమితి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో 5వ ప్రకృతి ఆధారిత పంటల మేళా నిర్వహిస్తున్నామన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించి పండించే పంటలు అనారోగ్యం కలిగిస్తాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని వివరించారు. ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యకరమన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ మాట్లాడుతూ 5వ తేదీ ఉదయం 10 గంటలకు రైతుల సమ్మేళనం, 6న మీ ఆరోగ్యం మీ చేతిలో, 7న ఫుడ్ ప్రాసెసింగ్, 8న మిద్దె తోటలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.